# కళకలలు

ఈ మధ్యన దవిన్సీ పెయింటింగ్ యింకోటి బయటపడ్డది... దవిన్సీని యిన్చి యిన్చీ కొల్చి ఒక్కో సెంటీమీటరుకో కోటో ఎంతో లెక్కలు కట్టారు ఆర్టు లవర్లు (లవర్సు).

కానీ ఆ చిత్ర పరిశ్రమ (నిజంగా శ్రమేనండోయ్) వెనక ఆ కళాకారుడి వేదన, యాతన ఎంత? దాన్ని దాచుకున్న కళాప్రేమికుడి కళారాధనా విలువ ఎంత? అని కొలిచే సాదనా లేవీ రోజుల్లో. ఈ రోజుల్లోనే కాదు. ఆ రోజుల్లో కూడానూ.

విన్సెంట్ వ్యాంగో అనే చిత్రకారుడు బతికినంత కాలం దుర్భరమైన దారిద్ర్యంతో బతికాడు.

వందలకొద్దీ చిత్రాలు వేశాడు. కేన్వాసులూ, రంగులూ కుంచెలూ కొన్డానికి వేశ్యలకి చిన్న చిన్న చిత్రాలు వేసి అమ్మి డబ్బు సమకూర్చుకొనేవాడు. కానీ బతికున్నప్పుడు ఒక్కటంటే ఒక్కటి పెద్ద చిత్రాన్ని అమ్ముకోలేకపోయాడు. అతను దారిద్ర్యంతో, మతిచాంచల్యంతో ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఈ రోజున అతని చిత్రం ఒక్కొక్కటి కొన్ని కోట్ల రూపాయలు పలుకుతుంది. ఈ రోజున కూడా ఎక్కడో ఎమ్.ఎఫ్. హుస్సేన్ లాంటి వాళ్ళు లక్షలాది రూపాయలకు ..... చిత్రాలను అమ్ముకొంటున్నారు.

* * *

కళాకారుల్లో చిత్రకారులూ, నర్తకులూ, గాయకులూ, శిల్పులూ వస్తారుగానీ అంటే ఖర్మో కవులూ, రచయితలూ రారు.

రాజుల పోషణలో వెనకటితరం కవులు ధనవంతులుగానే బతికుంటారు. (ఎక్కడో పోతన లాంటివాళ్ళు తప్ప).

ఈ తరం రచయితల్లో ఎంతమంది కవులూ రచయితలూ వాళ్ల వాళ్ల సాహిత్యాలకు సరైన విలువ పొందగల్గుతున్నారు.

సినిమా రచయితల్నీ కవుల్ని యిక్కడ మినహాయించాలి.

రచనలకందే పారితోషికాలంటారా. అవీ అంతంతమాత్రమే. అలాంటప్పుడు రచయితన్నవాడిక్కుడా రాయ మనస్కరించదు.

ఇక్కడో మాట చెప్పుకోవాలి. ఓ మళయాళీ రచయిత ఓ పుస్తకం అచ్చువేస్తే అయిదువేల కాపీలు అచ్చువేస్తాడుట.

ఇక్కడ మనం వెయ్యి కాపీలు అమ్ముకోవాలనుకుని అటకల మీద కట్టలు కట్టి ఆర్నెల్లకో దుమ్ము దులుపుకుని ఎలుకలకు నైవేద్యమైన వాటిని వేరు చేసుకుని మన జీవితకాలం అమ్ముకుంటూనే వుంటాం.

కొన్ని పుస్తకాలి మధ్య అమ్ముడవుతున్నాయి అది సృజనాత్మక సాహిత్యం కాదు వికాసాలూ, నిచ్చెనల్లూ, పైకెగబాక రాలూ, ఆకాశాన్నందుకోడాలూ... యివీ..

* * *

రచనల విషయం వచ్చింది కాబట్టి యిక్కడ ఓ ఇద్దరు వ్యక్తుల గురించి ప్రస్తావించాలి.

ఒకాయన పేరు శ్రీరాగి (కోసల్లి పూర్ణచంద్ర సదాశివ సుబ్రహ్మణ్యేశ్వరరావుగారు) ఇంకొకాయన వియోగి (విజయప్రసాద్)పై చెప్పిన శ్రీరాగిగారి కుమారుడు. ఈయనకు బి.ఎస్‌తో పాటు అయిదు (అక్షరాలా అయిదు) ఎమ్మే డిగ్రీలున్నాయి. శ్రీరాగిగారు ప్రభుత్వాధికారిగా రిటైరయ్యారు. వియోగి ఎల్.ఐ.సి ఏజెంట్ కాలేజీ ప్రిన్సిపాలుగా వున్నారు.

వీళ్లిద్దరూ అవిశ్రాంతంగా రాస్తూనే వుంటారు. యిద్దరూ 150 పై చిలుకు కథలు రాసి వివిధ పత్రికల్లో ప్రచురించారు. శ్రీరాగి గారి ఇంగ్లీషు అనువాద కథలు ఎన్నో యిదే పత్రికలో ప్రచురితమయ్యాయి.

పుస్తకాలు అచ్చువేపించి యిస్తామంటూ సాహితీ సేవకుల వేషాలు వేసుకున్న బ్రోకర్లు కొల్లలుగా వున్న దేశం కదా మన్ది.

తండ్రికొడుకులిద్దరూ ఈ బ్రోకర్ల బారినపడి ఓ లక్షరూపాయలు నున్నగా రాల్చుకున్నారు.

వీళ్ళిద్దరూ మహాద్భుతమైన సాహితీ సృజనకారులని అనలేను కానీ, వీళ్లిద్దరికీ వున్న సాహితీ నిబద్ధత మాత్రం చాలా గొప్పది అని చెప్పగలను.

వీళ్లు అసలైన కళాకారులనిపిస్తుంది.

* * *

కళాకారుడు ఏ రూపంలోనైనా వుండొచ్చు శిల్పి. చిత్రకారుడు. గాయకుడు, నర్తకుడు, కవి, వక్త వీళ్లందరి మీదా వీళ్లందరికంటే అద్భుతమైన కళాకారులు మన ముందుంటారు...

మంచి శ్రోతలు. వీళ్లు బహు తక్కువగా ఉండి అరుదుగా కనిపిస్తూంటారు.

* * *

మా కర్నూలు -నంద్యాల రోడ్డు మీదికి ఒక హోటేలుంది. చిన్నదే. అందులో ఓ ఇరవై ఇరవై అయిదు సంవత్సరాల కుర్రాడు పనిచేస్తాడు. వాడి పని కూరగాయలు తరగడం.

వాడు ఉల్లిపాయలు తరుగుతాడండీ. అసలు ఉల్లిపాయవేపు చూడడు. వాడివేళ్లూ కత్తే చూస్తుంటాయి. ఆ కత్తి కూడా సగం అరిగిపోయి మాసిన పాత చిరుగుగుడ్డ చుట్టబడిన హ్యాండిల్ కలిగుంటుంది. వాడు ఉల్లిపాయలు తరిగే చెక్కముక్కను కూడా హోటేలు కష్టమర్లు ఎప్పుడో సగానికి పైగా తినేసారు. నల్లగా బక్కపల్చగా ఉండి జెట్ స్పీడ్‌తో ఉల్లిపాయలు తరిగే వాడి నైపుణ్యం నా మటుకు నాకు ఓ అద్భుతమైన కళే అనిపిస్తుంది సుమండీ.

* * *

జనార్ధన మహర్షి తన 'వెన్న ముద్దలు' పుస్తకం వెనక యిలా రాసుకున్నాడు.

"నాకు చాలాసార్లు ఓ కల వస్తుంటుంది. చాలా అందమయిన కల. అందులో కవి ఒకడు. తన కవిత్వం ద్వారా సంపాదించిన డబ్బుతో కారులో తిరుగుతూంటాడు. కాలు మీద కాలేసుకొని దర్జాగా కూర్చుంటాడు. ఆ కవిత్వం పదే పదే ముద్రింపబడి ఆ కవి మనవళ్లు రాయల్టీ రూపంలో లక్షలు పొందుతుంటారు.

అతని గొప్ప కవితాపదాలు యింటింటా గాయత్రీ మంత్రమవుతుంది.

అప్పుడు కవి తన డబ్బుతో తన కవిత్వం ప్రింట్ చేసుకోనక్కర్లేదు. అప్పుచేసి, ఆస్తులమ్మి కవితా సంకలనాన్ని పుస్తకాల షాపులో దుమ్ము పట్టించుకోనక్కర్లేదు"

మహర్షీ! మీ కల నిజమవ్వాలని నేను కోరుకోడం కూడా కలేనా? ●